# ఓడిపోయాక

"మర్చిపోరు కదూ" అంది భానుమతి తలుపు వరకూ వచ్చి. అలాగే అన్నట్టు తలూపి, తలుపు తీసుకొని వెళ్ళిపోయాడు. అతని జోళ్ళ శబ్దం వింటూ భానుమతి తలుపుకు జారబడి అలాగే వుండిపోయింది. నడవాలో ఓ నిముషం పాటు ఆగిపోయి మళ్ళీ శబ్దం వినిపించి క్రమంగా ఫేడౌట్ అయిపోయింది.

అతను వెళ్ళిపోయినా గదిలో యింకా సిగరెట్టు వాసన పోలేదు. ఫేను వేస్తే సిగరెట్టు నుసి గుప్పున కళ్ళల్లోకి దుమ్ములా కొట్టింది. భానుమతి కళ్ళు నులుముకొంది, చేతివేళ్ళకి నిద్రమత్తు వెల్వెట్‌లా తగిలినట్టనిపించింది. ఆవలింతతో ఒళ్ళు విరుచుకుంది. నీరసం నరాల్లోంచి మనసులోకి జలపాతంలా దూకుతోంది.

భానుమతి రెండు ఏపిల్ పళ్ళు తిని మంచినీళ్ళు తాగింది. నలిగిపోయిన పక్క సర్దుకుని నిస్సత్తువతో దానిమీద వాలిపోయింది. గత రెండు నెలల జీవితమూ మాటిమాటికి గుర్తొస్తోంది. కాని గుర్తుచేసుకొనే ఓపికలేదు. ఓపిక వెనక ధైర్యంలేదు. ధైర్యం వెనక వెలుగులేదు. భయం, కోపం, అసహాయత. మాడిపోయిన వెలుగుదార్లలో చిక్కులు పడిపోయిన చీకటి గజిబిజి అల్లిక. అలాటి దారిలో బితుగ్గా, నిస్త్రాణగా వెళ్ళివెళ్ళి ఎక్కడో దారితప్పి సొమ్మసిల్లి పోక తప్పదు.

తలుపులు తోసుకుని రత్నాబాయి గ్లాసుతో పాలు పట్టుకొచ్చింది. "చలి వణికించేస్తోంటే ఫేను వేసుకున్నావేమిటీ? తీసెయ్యనా, ఉదయానికి మళ్ళీ రొంప చేసేస్తుంది" అంది.

భానుమతి ఏమీ మాట్లాడలేదు. అటుపక్కకి తిరిగి పడుకుంది.

"ఎందుకే పిల్లా అంతకోపం. ఇదిగో పాలు, టేబిలు మీద పెడ్తున్నాను. వేడివేడిగా వున్నప్పుడే తాగేవంటే వొంట్లో అలసటంతా ఎగిరిపోతుంది."

ఫేను ఆపేసి, దుప్పటికప్పి, తలుపు దగ్గరగా చేరేసి వెళ్ళిపోయింది.

భానుమతికి ఇంకా ఆకలిగానే వుంది. పాలు తాగి నిండా ముసుగు కప్పేసుకుని నత్తలా ముడుచుకుపోయింది. వేడివేడి పాలు తాగడంవల్ల నిద్ర తేలిపోయినట్టుంది. కళ్ళ రెప్పల వెనక నీడలు కదులుతున్నాయి. మనసు పొరలకిందే ఆలోచనలు ప్రవహిస్తున్నాయి.

ఈయనైనా వుత్తరం రాస్తాడో లేదో! చాలా నమ్మకంగానే చెప్పాడు. ఎంతగానో జాలిపడ్డాడు. సానుభూతి చూపించాడు. అలా సానుభూతి చూపిస్తూనే, జాలిపడుతూనే, ఒంటిమీద మళ్ళీమళ్ళీ అధికారం సంపాదించుకున్నాడు. ఇంతకుముందూ యింతే. చాలాసార్లు జరిగింది. కాని యింతవరకు ఫలితం లేకపోయింది. కష్టం మాత్రమే మిగిలింది. తన అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అంతా లాభం పొందడానికే ప్రయత్నిస్తున్నారు. సాయపడేవాళ్ళే లేరు. అయినా ఏరోజుకారోజు ఆశపడక తప్పడంలేదు. నిరాశలోంచే ఆశ పుడుతుందేమో.

పూర్తిగా ఆలోచనల్లో కొట్టుకుపోకుండానే నిద్ర ఆమె మీదికి వాలిపోయింది. నిస్సత్తువతో ముట్టుకుంటే వూడిపోయేట్టున్న అన్ని కీళ్ళ కూడళ్ళలోంచీ పాకుతూవచ్చి ఆలోచన ద్వారాల్నీ, కంటి రెప్పల్నీ ముడులేసి బిగించేసింది నిద్ర. చాలా రాత్రుళ్ళలాగే ఆ రాత్రికూడా ఆమెకు కలల్లేని మత్తు నిద్రలో మిగిలిన సగం రాత్రీ గడిచిపోయింది.

ఉదయం బాగా ఎండెక్కేకగాని తెలివి రాలేదు. తెలివొచ్చినా వెంటనే మంచంమీంచి లేవాలనిపించలేదు. వొళ్ళంతా ఏకీలుకాకీలు విడిపోయేట్టుగా వుంది. అలాగే మంచంమీద పడుకుని వుండిపోయింది భానుమతి.

రత్నాబాయి తలుపు తోసుకుని తొంగిచూసి మళ్ళీ దగ్గరకు చేరేస్తుండగా ఆ అలికిడికి కళ్ళు తెరిచింది భానుమతి.

"ఏమీలేదు. ఊరికే .... వుండు. అప్పుడే లేవటం ఎందుకులే. మరి కాస్సేపు పడుకో" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఎవరిమీదా లేని యింత అభిమానం తనమీదెందుకో అర్థంకాకపోలేదు భానుమతికి. పిలిస్తే పరుగెత్తుకొచ్చి, అడక్కుండా అన్నీ అమర్చిపెట్టి తనని

మహారాణీలా చూసే యీ అభిమానం శాశ్వతమని నమ్మేంత తెలివి తక్కువది కాదు ఆమె. అందుకే ముసలావిడ తియ్యగా మాట్లాడినప్పుడల్లా చటుక్కున గొంతుపట్టుకుని పిసికేసి గుడ్లు తేలేసేదాకా వదిలిపెట్టగూడదని వుంటుంది. కాని అది సాధ్యంకాదు. ఈ వయసులోకూడా గుండ్రాతిలాగా వుంటుందామె.

మరో అర్ధగంట మంచంమీదే అటూ యిటూ దొర్లుతూగడిపి మెల్లగా లేచింది. బాత్‌రూమ్‌కి వెళ్తోంటే రాధిక వేళాకోళం ఆడిందిగాని భానుమతి పట్టించుకోలేదు. మామూలుగా పలకరించినట్టు తలెత్తి చిర్నవ్వు నవ్వేసి వెళ్ళిపోయింది. ఎవర్నీ నమ్మేట్టులేదిక్కడ. ఒకొక్కప్పుడు తన నీడే తనని భయపెడ్తున్నట్టుంటుంది. అందుకని ఎవరికి దగ్గరగా వెళ్ళాలన్నా భయమే. ఎవరయినా తనని చూసి నవ్వితే ప్రతిగా నవ్వడం, పలకరిస్తే పలకరించడంతప్ప తనంతతానుగా ఎవరితోనూ సన్నిహితంగా కలవదలుచుకోలేదు భానుమతి.

కాలకృత్యాలవీ పూర్తి చేసుకుని తన వొంటికి అంటుకున్న మైసూరు సేండిల్ తాజా వాసనని మత్తుగా పీల్చుకుంటూ అరమోడ్పు కళ్ళతో గదిలో అడుగుపెట్టిన భానుమతికి పనిమనిషి గది వూడుస్తూ కనిపించింది. మంచం కింద నేలమీద చిందర వందరగా పడివున్న గుప్పెడు సిగరెట్టు పీకల్ని దగ్గరగా పోగెట్టి చేటలోకి ఎత్తుతోంది.

రాత్రి ఇన్ని సిగరెట్లు కాల్చాడా ఆయన! అని ఆశ్చర్యపోయింది భానుమతి. అంతకు పదింతలుగా, యిలాటి మనిషిని తను ఎలా భరించ గలిగానా అని కూడా విస్తుపోయింది.

ఏవేవైతే తనకు యిష్టంలేవో వాటన్నిటికీ క్రమక్రమంగా తను అలవాటు పడిపోతున్నానన్న విషయం ఆలోచించేసరికి నిలువెల్లా ఒక్కసారి ఆమె వణికిపోయింది. యిప్పటికే తాను ఎంతగానో మారిపోయింది. మరికొంత కాలం పోతే తనని తానే గుర్తుపట్టలేదేమో!

పనిమనిషి వెళ్ళిపోయాక తలుపులు దగ్గరగా చేరేసి వచ్చి కిటికీముందు కూచుంది భానుమతి. ఆ కిటికీలోంచి చూస్తే ఏమీ కనిపించదు—ఎదురుగా వున్న మేడ గోడ తప్ప. ఆ గోడకి కిటికీవున్నా అదెప్పుడూ తెరుచుకోదు. అందువల్ల కిటికీలోంచి ప్రాణంలేని, కదలికలేని, మార్పులేని గోడ ఎప్పుడూ

ఒకేమాదిరిగా అసహ్యంగా, అర్థరహితంగా కనిపించి మరీ విసుగు కలిగిస్తూ వుంటుంది. అయినా భానుమతికి ఆ కిటికీలోంచి చూడ్డంకన్నా మరో కాలక్షేపం లేదు. ఏమీ తోచనప్పుడల్లా అదే కిటికీలోంచి, అదే ఆసక్తిలేని, అదే గోడను చూస్తూ వుండిపోతుంటుంది ఆమె.

అక్కడలా కూచున్నప్పుడు చూడ్డానికి ఏమీ వుండదు గనక ఆమె చుట్టూ ఆలోచన్లు ముసురుకుంటాయి. ఆ చోటుకీ ఆలోచన్లకీ లంకెవుంది. వాటి నుంచి ఆమె తప్పించుకోలేదు.

సిగరెట్ల మీంచి చిన్నతనంలోకి రెక్కలూపుకుంటూ ఆలోచన్లు ఎగిరి పోయాయి. ఎవరి చేతిలో సిగరెట్టు చూచినా తెల్లగొంగళీ పురుగుని చూసినట్టే వుండేది. అదంటే పరమ అసహ్యం. ఆ వాసన కూడా కిట్టదు. తలనొప్పి వచ్చేస్తుంది. మొన్నమొన్నటివరకూ ఇంతే. హైస్కూల్లో చదువుకునేటప్పటి మాట. ప్రయివేటు క్లాసు వుందంటే ఉదయం ఎనిమిదింటికే స్కూలుకి వచ్చే సింది. ఇంకా ఎవరూ రాలేదు. వాచ్‌మన్ క్లాసు తెరిచి శుభ్రం చేస్తున్నాడు. అందాకా అలా ఎండలో నుంచుందామని రింగ్‌టెన్నిస్ ఆడుకునే కోర్టులోకి వెళ్ళింది. అక్కడ రాజారాం, సుబ్బారావూ కూచుని దొంగచాటుగా సిగరెట్లు కాలుస్తున్నారు. ఆమెను చూసి గతుక్కుమన్నాడు రాజారాం. "వుండు, మీ నాన్నతో చెప్తాను" అంది. వాళ్ళిద్దరి యిళ్ళూ ఒకే వీధిలో దగ్గర దగ్గరగానే వున్నాయి. రాజారాంకి వాళ్ళింట్లో చనువెక్కువ. సుబ్బారావుతో అంత పరిచయం లేదు.

ఇంట్లో చెప్పొద్దని ఎంతగానో బతిమాలుకున్నాడు రాజారాం. అప్పట్నించీ అతన్ని ఎప్పుడైనా ఏడిపించాలంటే "నువ్వు సిగరెట్లు కాలుస్తున్నా వని మీ నాన్నతో చెప్పేస్తాను సుమా" అని భయపెడ్తుండేది. అతను కొంత కాలం అలాగే భయపడ్తుండేవాడు. తర్వాతర్వాత "చెప్పుకుంటే చెప్పుకో" అని ఎదురు తిరిగేవాడు. ఆ తర్వాత అలా అనడం మానేసి ఆమె చూస్తుండ గానే సిగరెట్టు తీసి కాల్చి ఆమెనే ఏడిపిస్తుండేవాడు. ఒకసారి ఆమెకు కోపం వచ్చి అతనితో మాట్లాడ్డం మానేసింది. అప్పటినుంచీ అతను ఆమె చూస్తుండగా సిగరెట్లు కాల్చేవాడు కాదు. ఆమె చదువు స్కూల్‌ఫైనల్‌తో ఆగిపోయి అతను పట్నంలో కాలేజీ చదువు చదువుతున్నప్పుడుకూడా తన ఎదురుగా సిగరెట్లు

కాల్చడానికి ఒప్పుకునేది కాదు. చివరికి అతను నగరంలో ఉద్యోగం చేస్తూ చాలా పెద్దవాడైపోయి ఎప్పుడైనా స్వగ్రామం వస్తే, అతనికి సిగరెట్లు కాల్చే అలవాటు ఎంత ఎక్కువైనా ఆమె ఎదుట కాల్చేవాడు కాదు. వచ్చినప్పుడల్లా ఆమెను చూడకుండా వెళ్ళేవాడూ కాదు. ఏదో వంకన వాళ్ళింటికి వెళ్ళి ఆమెను పలకరించి మరీ వచ్చేవాడు.

రాజారాంను గురించి ఆలోచిస్తోంటే ఆమెకు కళ్ళనీళ్ళు తిరిగాయి. ఏడుపొచ్చింది. అలాంటి తియ్యని అభిమానానికి తను నోచుకోలేకపోయింది. ఎంతో సాహసంతో తను చేసిన పని చివరకు యిలాంటి ఫలితాన్నిస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఇప్పుడు ఏం చేయగలదు? ఏమీ చేయలేని అసహాయస్థితితప్ప ఏం మిగిలిందని. చివరకు ఎలా అయిపోయింది తన బతుకు!

రాధికా, 'రాంచిలుకా' బిలబిల్లాడుతూ వచ్చారు. భానుమతి చెక్కిళ్ళ మీంచి కన్నీరు కారడం చూసి—

"ఏడవడం మర్చిపోయావనుకున్నానే. ఇంకా ఏడుస్తున్నావేమిటి? ఏడిస్తే కన్నీళ్ళు కారడం తప్ప ఏం లాభంలేదు. మాలాగా నవ్వడం నేర్చుకుంటే ఎప్పటికన్నా బాగుపడ్తావు. పద, కాస్సేపు కేరమ్స్ ఆడుకుందాం" అంటూ ఆమెను బలవంతంగా లేవదీసి చెవిలో గుసగుసలాడి ఆమె నవ్వేవరకూ వొదిలిపెట్టలేదు.

నిజమే. ఇప్పుడు ఏడవడం మర్చిపోయింది. మొదట్లో అయితే రోజల్లా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూనే వుండేది. ఇప్పుడు రాజారాం గుర్తొచ్చాడు గనక కన్నీళ్ళు తిరిగాయి. లేకపోతే అవికూడా వచ్చేవి కావేమో. ఎలాంటి జీవితం చివరికి ఎలా మెలితిరిగిపోయింది! ఆలోచిస్తోంటే భయంకూడా వేస్తోంది.

అందుకే భానుమతి ఆలోచించడంకూడా మానుకోవాలనుకుంది. ఆ రోజు నుంచీ ఆమె కిటికీ దగ్గర కూచోడం తగ్గించేసింది. నిద్ర బాగా అలవాటు చేసుకుంది. నిద్రరాక, ఏమీ తోచకపోతే అద్దంముందు కూచుని అలంకరించుకుంటూ గడిపేయడంకన్న వుత్తమమైన కాలక్షేపం మరోటి కనిపించలేదు.

వారం రోజులు గడిచాయి. ప్రతిరోజూ ఏదో ఒక అద్భుత సంఘటన జరగబోతోందన్న ఆశతోనే ఎదురు చూస్తోంది భానుమతి. ఏ ప్రత్యేకతా

లేకుండా యధావిధిగానే ప్రతిరోజూ గడిచిపోతోంది. అదే జీవితం. అదే నిరాశ. అదే ఆశ.

ఇంటికి ఉత్తరం రాసిపెట్టమని మరోసారి యింకెవరినో అడుగుదామనుకుంది. కాని మళ్ళీ అడగలేదు. ఇప్పటికే అరడజను మందికి పైగా చెప్పింది. అడ్రసులు కూడా తీసుకున్నారు అలాగే రాస్తాం అన్నారు. నమ్మక తప్పనంత తియ్యగా చెప్పారు. వాళ్ళను నమ్మి ఆశలు పెట్టుకుంది. ఇంటి దగ్గరనుంచి ఏ క్షణంలోనైనా ఎవరో ఒకరు వస్తారని ఎదురు చూస్తోంది. కాని ఆశ నిరాశే అయ్యింది. ప్రతిసారీ నమ్మి మోసపోవడం తప్ప ఒరుగుతున్నదేమీలేదు. అందుకే మరిక ఎవరికీ చెప్పదలచుకోలేదు.

కాని మరో మూడు రోజులు గడిచాక అకస్మాత్తుగా ఓ రాత్రివేళ తలుపులు దబదబమన్నాయి. ఇప్పుడిప్పుడే ఆమెకు నిద్రపడుతోంది. ఆ శబ్దానికి ఆమె తుళ్ళిపడి లేచింది. తలుపులు తీసింది.

ఎదురుగా పోలీసు!

అతన్ని చూడగానే ఎంతగా ఆశ్చర్యపోయిందో అంతగానూ ఆమెకు ప్రాణం లేచొచ్చింది. పంజరంలోంచి బైటపడి రెక్కల్ని టపటపా కొట్టుకున్న పక్షిలాగ సంతోషంతో గుండెలమీద పవిట రెపరెపలాడింది.

"బాబ్బాబు ముందు నన్నిక్కడ్నించి బైటికి చేర్చారంటే మీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను. నేను యిక్కడి మనిషిని కాదు. మోసంచేసి యిక్కడికి లాక్కొచ్చి పడేశారు...."

"నీ పేరు భానుమతేనా?" నిదానించి చూసి అడిగాడు పోలీసు.

"అవును, భానుమతినే. రైలుదిగి మా బంధువుల గురించి ఎదురు చూస్తోంటే, ఒకాయన నమ్మకంగా మాటలు చెప్పి నేను వెళ్ళాల్సిన చోటుకి చేరుస్తానని చివరికి యీ కూపంలోకి లాక్కొచ్చాడు. తప్పించుకు పోదామంటే...."

"అవునవును. ఆ విషయమంతా తెలుసు. ఇంక నీకేం భయంలేదు, నా కూడా రా. ఇంతకీ లోపల ఎవరైనా వున్నారా?" అంటూ గదిలోకి తొంగి చూశాడు పోలీసు.

"ఎవరూ లేరు. వెళ్ళిపోయి చాలాసేపైంది" అంది ఆమె.

ఆమెను వెంటబెట్టుకుని హాల్లోకి వచ్చాడు పోలీసు. అక్కడ ఎస్.ఐ., మరొక యిద్దరు పోలీసులూ వున్నారు. వాళ్ళను చూడగానే దుఃఖం ఆపుకోలేక గొల్లున ఏడ్చేసింది. ఎస్.ఐ. ఆమెను ఊరుకోబెట్టడానికి చాలా ప్రయత్నించాడు గాని, ఆమె దుఃఖానికి అడ్డుకట్ట వేయలేకపోయాడు. మూడు పట్టీల ముసలి హెడ్‌కానిస్టేబులు ఆమెకు ధైర్యం చెప్పి పదినిమిషాలకు ఎలాగైతే ఊరుకోబెట్టాడు.

"నీకేం భయంలేదు. పొద్దున్నే మీ నాన్న వచ్చి నిన్ను తీసుకెళ్ళిపోతాడు. ఇప్పుడాయన ఊళ్లోనే వున్నాడు. ఆయన పోలీసు కంప్లెయింట్ యిస్తేనే మేం మూడు రోజులబట్టి వెతుకుతున్నాం. మొన్న అకస్మాత్తుగా చాల చోట్ల రైడ్‌చేశాంగాని కనిపించలేదు నువ్వు. పట్టుబడ్డవాళ్ళకి నీ ఫోటో చూపితే చివరికి యీ యింట్లో వున్నట్టు తెలిసింది. ఒక విధంగా నువ్వు చాలా అదృష్టవంతురాలివి, ఇంత తొందరగా ని ఆచూకీ తెలుస్తుందనుకోలేదు" అన్నాడు.

రత్నాబాయిని, మరో మగనౌకరునూ అరెస్టుచేసి వేన్‌లో ఎక్కించారు. భానుమతిని కూడా తమతోపాటు తీసుకెళ్ళారు. ఆమెను ఆ రాత్రికి పోలీసు కంట్రోల్ రూమ్‌లో వుంచి మర్నాడు ఉదయాన్నే వాళ్ళ నాన్నకు అప్పజెప్తామన్నారు.

ఆ రాత్రి కంట్రోల్ రూమ్‌లో ఆమె నిద్రపోనేలేదు. ఇన్ని రోజులుగా ఆ పాపకూపంలోంచి బైట పడదామని ఒకటే ఆరాటపడిపోయింది. కాని తీరా బైటపడ్డాక నలుగురికీ తన ముఖాన్నెలా చూపించాలా అన్న దిగులు పట్టుకుంది. రానున్న వెలుగుని ఎలా భరించాలో అర్థంకావడంలేదు. వుదయంలోకి తొంగి చూడ్డానికి సిగ్గుగావుంది. ఏమీ జరగనట్లు అతి మామూలుగా పరిచయస్థుల ముఖాల్లోకి చూడాలంటే సాధ్యమా అనిపిస్తోంది. ఇప్పుడు రాజారాం ముందు తలెత్తి నిల్చోడం ఎలాగ? చిరునవ్వుతో పలకరించడం ఎలాగ?

రాత్రంతా రాజారాం ఆలోచన్లే ఆమెను చుట్టుముట్టేశాయి. అతనికి యీ సంగతంతా తెలుసుండకపోవచ్చు. అయినా అతనితో వెనకటిలా యిప్పుడు తను మాట్లాడగలదా? ఇప్పుడు కాకపోయినా మరొకప్పుడైనా యీ విషయం అతనికి తెలియకపోదు. అప్పుడు అతని కళ్ళతో తను కళ్ళు కలపగలదా?

కాని ఆ వుదయం తండ్రితోపాటు రాజారాంను కూడా చూసేసరికి ఆమెకు ఆశ్చర్యంతోపాటు దుఃఖమూ ముంచుకొచ్చింది. మరోసారి ఆమె భోరున ఏడ్చేసింది. ఎంతో కష్టంమీద తండ్రి ఆమెను ఊరుకోబెట్టాడు. రాజారాం ఏవో పొడిపొడిగా మాట్లాడంతప్ప ఎక్కువగా మాట్లాడలేక పోయాడు. భానుమతి సూటిగా అతని ముఖంలోకి చూడలేకపోయింది. అవిడే కాదు అతను కూడా ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు.

మాటల సందర్భంలో తండ్రి చెప్పాడు—

ఆమె రాయించిన వుత్తరం అందిన వెంటనే బయలుదేరి వచ్చాడట. ఓ నాలుగు రోజులు తనంతట తనే ఆమె ఆచూకీ తెలుసుకుందామని ప్రయత్నించాడట గానీ లాభంలేకపోయిందట. చివరికి రాజారాంను కలుసుకుని అతని సలహామీదే పోలీసు కంప్లెయింట్ యిచ్చాడట. మొదట్లో హోటల్లో దిగినా, రెండు రోజుల క్రితమే రాజారాం పట్టుబడితే, హోటలు ఖాళీచేసి అతని రూముకి మకాం మార్చేశాడట.

తండ్రి ఆ విషయాలన్నీ చెప్తూ "నాతోపాటు పాపం రాజారాం కూడా చాలా కష్టపడ్డాడమ్మాయ్. నా గురించి రెండ్రోజులు ఆఫీసుకు కూడా సెలవు పెట్టాడు. అతనికి మనం చాలా ఋణపడ్డాం" అన్నాడు.

జాలిగా నవ్వుకుంది భానుమతి. అతనిమీద ఏర్పరచుకున్న యీ అభిమానంలో పదో వంతయినా యింతకు ముందు వుండివుంటే తన బతుకు ఇలా తయారయ్యేదే కాదు—అనుకుంది భానుమతి. చెప్పినా వినిపించుకోకుండా తన పంతమే నెరవేరాలనే తన తండ్రి మొండి పట్టుదలవల్లే తాను ఇల్లు వొదిలిపెట్టాల్సి వచ్చింది.

ఆ రోజున ఏ మాత్రం తన మాట వినిపించుకోని తన తండ్రి యిప్పుడిలా మాట్లాడుతోంటే జాలిగా నవ్వుకోక చేసేదేంవుందిప్పుడు. చెయ్యడానికేమీ మిగలనప్పుడు యిలాటి నిస్సహాయతలో తనమీద తనకి జాలికాక మరింకేం కలుగుతుంది!

కూతుర్ని తీసుకుని ఆరోజే వెళ్ళిపోదాం అనుకున్నాడు తండ్రి. ఒకరోజు ఆగి వెళ్దాం అంది భానుమతి. పైగా ఆ రోజుకి రిజర్వేషన్ కూడా దొరకలేదు.

మర్నాటికయితే సీట్లున్నాయి. సరే ఒకరోజు ఆగి వెళ్దాం అనుకుని అప్పటికి టిక్కట్లు తీసుకున్నాడు.

రాజారాం రూము మరీ చిన్నదేం కాకపోయినా ముగ్గురు పడుకోవాలంటే కష్టమే. పైన డాబా వుంది కానీ చలికాలం. అక్కడవున్న నాలుగు పోర్షన్లలోకి వెళ్ళడానికి సందులాంటి సన్నని వరండా ఒకటి వుంది. రాత్రి పది దాటాక దాంట్లోంచి వచ్చిపోయేవారిక వుండరు. తన పక్క అక్కడ వేసుకుందాం అనుకున్నాడు రాజారాం.

హోటలునించి కేరియరు తెప్పించి భోజనం చేసేసరికి తొమ్మిదయ్యింది. మరో గంటవరకు పడుకోడానికి వీల్లేదు. అంతవరకూ అలా డాబా మీద పచార్లు చేసివద్దామని పైకి వెళ్ళాడు. భానుమతీ, ఆమె తండ్రీ గదిలో పడుకున్నారు. ఆయనకు తొందరగానే నిద్ర పట్టేసింది. ఆమెకు మాత్రం నిద్ర పట్టలేదు. తండ్రి గురక తీసేవరకు వుండి లేచి డాబామీదకు వెళ్ళింది.

ఆమె అడుగుల చప్పుడు విని వెనక్కు తిరిగి చూసి గుర్తుపట్టి "ఏం నిద్ర పట్టడంలేదా?" అని అడిగాడు రాజారాం.

"నిద్రపోలేదు. నీతో ఓ విషయం మాట్లాడుదామని మేలుకునివుండి ఇలా వచ్చాను" అంది.

పైన చీకటిగా వుంది. ఆకాశం వెలుగులో అస్పష్టంగా రూపాలు కనిపిస్తున్నాయి. వాళ్ళిద్దరూ పిట్టగోడకు దగ్గరగా వచ్చి నిల్చున్నారు.

"ఆ రోజు నువ్వు స్టేషనుకు ఎందుకు రాలేదు?" అంది భానుమతి.

"ఏరోజు?" అన్నాడు అతను ఆమె వైపు తిరిగి.

"అదే....నేను యీ వూరు వచ్చిన రోజు."

"ఏమో....నువ్వు వస్తున్నట్టు నాకేం తెలుసు?"

ఉత్తరం రాశాను కదా;"

"అందలేదే అడ్రసు సరిగానే రాశావా?"

భానుమతి ఓ నిమిషం ఏమీ మాట్లాడలేకపోయింది. ఆ తర్వాత చాలా నీరసంగా "ఇంతకు పూర్వం ఎన్ని వుత్తరాలు రాయలేదు. అవన్నీ అందిి

యిదొక్కటే అందకపోవడం ఏమిటి!" అంది. ఓ క్షణం ఆగి మళ్ళీ "ఉత్తరం అందలేదని ఎంత తేలిగ్గా అబద్ధ మాడుతున్నావ్. నిజంగా నీకు వుత్తరం అందలేదూ ?" అంది.

"లేదు" అన్నాడు రాజారాం.

"చూశావా. ఈ తప్పు నీకు అంటుకోకుండా వుండడానికి ఎంత పెద్ద అబద్ధం ఆడుతున్నావో. నేనూ నమ్మేదాన్నే కాని ఆ వుత్తరం నా కళ్ళబడింది. ఇందాక నువ్వు కాఫీకో దేనికో బైటికెళ్ళినప్పుడు నీ పుస్తకాల రేక్ చూస్తోంటే అందులో కనిపించింది."

రాజారాం సిగరెట్టు తీసి వెలిగించాడు. దమ్ము లాగినప్పుడల్లా అతని ముఖం ఎర్రగా రక్తం పూసుకొన్నట్టు మండుతోంది.

"నువ్వు కావాలనే ఆ రోజు స్టేషనుకు రావడం మానేశావ్ కదూ" అంది భానుమతి.

"అవును. కావాలనే మానేశాను. అయితే యిప్పుడేమంటావ్?" అన్నాడు చాలా అసహనంగా.

భానుమతి దానికి సమాధానం చెప్పకుండా "రాజారాం! నాన్న యీ రోజే వూరెళ్ళిపోదామంటే రేపు వెళ్దామని ఆపాను, ఎందుకో తెలుసా....వెళ్ళే ముందు నీతో కొన్ని విషయాలు మాట్లాడుదామని. ఇంతకీ నన్ను రేపు వెళ్ళి పోమంటావా!? వుండమంటావా ?"

"వెళ్తేనే మంచిది. ఇక్కడ వుండిమాత్రం చేసేదేముంది ?" అన్నాడు రాజారాం.

"నీలా అంత తేలిగ్గా తీసుకోలేను రాజారాం. నీ కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలయినా సరే నీ దగ్గరే వుండిపోదామనుకుంటున్నాను. ఆ విషయమే నీతో మాట్లాడుదామని ఆగిపోయాను" అంది ఆమె.

"నా దగ్గరా! ఇంత జరిగాక నన్నెలా పెళ్ళి చేసుకోమంటున్నావ్. నేనూ మనిషినే. నాకూ రాగద్వేషాలున్నాయి" అన్నాడు అతను.

"లేవనడంలేదు. కాని సానుభూతితో ఆలోచించమంటున్నాను. నీ గురించేకదా యింత సాహసం చేశాను. నిన్నుకాదని నాన్న మరో సంబంధం ఖాయపరిచినప్పుడు నీకు ఉత్తరం రాస్తే నువ్విచ్చిన సమాధానం అప్పుడే మర్చి

పోయావా? నువ్వు రమ్మంటేనేకదా పారిపోయి వచ్చాను. నీమీద ఎంత ప్రేమ లేకపోతే యింత సాహసానికి పూనుకుంటానో ఆలోచించావా. ఆ రోజు స్టేషనుకి వచ్చివుంటే యిలా జరిగేదికాదని నీకూ తెలుసు."

"బాగుందివరస. దానికి నన్నే తప్పుపడుతున్నావన్నమాట." రాజారాం కంఠంలో చికాకు విసురుగా తుళ్ళింది. "చూడు భానుమతీ నీకు బాధ కలిగినా సరే ఒక మాట చెప్పక తప్పదు. నేను ఎంగిలి కూడుకు ఆశపడే మనిషిని కాదు. అంతే" అన్నాడు తిరిగి.

భానుమతి ఏడుస్తున్నట్టుంది సన్నగా ఎక్కిళ్ళు వినిపిస్తున్నాయి. రాజారాం అదేమీ తనకు పట్టనట్టు అక్కడ్నుంచి కదిలి డాబా అవతలి కొస దగ్గరకెళ్ళి నుంచుని నిర్లిప్తంగా దూరంగా వున్న దీపాలకేసి చూస్తున్నాడు.

పది నిమిషాలు తనలో తనే కుమిలి ఏడ్చి, చివరకు ఓదార్చేవారులేక, తనకితనే దుఃఖాన్ని దిగమింగుకుని కళ్ళు తుడుచుకుంటూ రాజారాం దగ్గరకు వచ్చింది. అతను అక్కడ్నుంచి గబగబా మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

ఓ నిమిషం తర్వాత ఆమె కూడా కిందకు దిగిపోయింది. అప్పటికే అతను పక్కతీసుకుని వరండాలోకి వెళ్ళిపోయాడు.

భానుమతి తలుపులు దగ్గరగా చేరేసుకుంది. ఓ గంట తర్వాత ఆ తలుపుల్నే తీసుకుని బైటికొచ్చింది. మళ్ళా లోపలికి వెళ్ళలేదు.

ఉదయం ముందుగా రాజారాంకే తెలిసింది—ఆమె వెళ్ళిపోయిందని. గదిలో వాచీ పెట్టివద్దామని వెళ్తే కాళీ పక్క కనిపించింది. చటుక్కున లైటు వేశాడు. టేబిలు మీద స్పష్టంగా కనిపించేట్టుగా ఓ వుత్తరం వుంది.

"నాన్నా! నీ కూడా రాలేను. ఓడిపోయాక ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ ఆ వూళ్ళో అడుగుపెట్టగలను! నా గురించి చూడకు. నేను చచ్చిపోవడంలేదు. బతుక్కి దారొకటి వెతుక్కోవాలికదా. ఎప్పుడైనా నా దగ్గరనుంచి మనియార్డరు వస్తే తిరగొట్టవు కదూ. అమ్మకు నా నమస్కారాలు చెప్పు—భానుమతి."

రాజారాం గతుక్కుమన్నాడు. తనకి ఎక్కడైనా వుత్తరం పెట్టిందేమో అని చూశాడు గాని కనిపించలేదు. టేబిలు కింద కసికొద్దీ నలిపేసి వుండచుట్టి పారేసిన తన ఫోటో మాత్రం కనిపించింది.

(1976)

★